క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

డోర్నకల్: స్థానిక జీఆర్పీ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అమీర్‌ఖాన్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. జీఆర్పీ స్టేషన్‌లో కొంతకాలంగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన అమీర్ ఖాన్‌కు ఖమ్మం జీఆర్పీ సీఐ అంజలి బ్యాడ్జి అందించి అభినందించారు.

హోంగార్డులకు చేయూత



మహబూబాబాద్ రూరల్: జిల్లా హోంగార్డుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ రూ.50వేల ఆర్థిక సాయాన్ని చెక్ రూపంలో శనివారం అందజేశాడు. జిల్లా కేంద్రంలో వివేక్‌ను జిల్లా హోంగార్డుల అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు



మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మానుకోట బీజేపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడపై శుభాకాంక్షలు తెలిపామన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు పల్లె సందీప్‌గౌడ్, నాయకులు, సంపత్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.


షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాపు దగ్ధం

గూడూరు: మండలంలోని మచ్చర్లలో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఓ టైలర్ షాపు దగ్ధమైన సంఘటన జరిగింది. వివరాల ప్రకారం.. బూర్క పాపయ్య అనే వ్యక్తి స్వగ్రామమైన మచ్చర్లలో టైలర్ వృత్తి కొనసాగిస్తున్నాడు. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. షాపులో ఉన్న దుస్తులు, సామగ్రి దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష విలువ నష్టం జరిగినట్లు బాధితుడు పాపయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడికి నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ నాయకులు జలగం సంపత్‌రావు, వాంకుడోతు కఠార్‌సింగ్ కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ అర్బన్: హన్మకొండ కాళోజీ కళాక్షేత్రంలో ఈనెల 23న జరిగే ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి మెరుగు అశోక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని శనివారం ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం వాల్ పోస్టర్లను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఇసంపల్లి బాబు, సాంబశివ, బోడ లక్ష్మణ్‌నాయక్, కుమార్, కిషన్, రామకృష్ణ, సుధాకర్, వెంకన్న, యుగేందర్, కిరణ్, రజాక్ పాల్గొన్నారు.

నేడు శ్రీవారి రథం ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రి శ్రీజగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నూతన శ్రీవారి రథం ఆదివారం రాత్రి 9గంటలకు ప్రారంభం కానుందని ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రదరాచార్యులు శనివారం తెలిపారు. ముఖ్య అతిథిగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: మహిళలను సన్మానిస్తున్న కాళోజీ వాకర్స్ సభ్యులు



గార్ల: కేక్ కట్ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు



మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో..



మహబూబాబాద్: మహిళా క్రీడాకారులకు సన్మానం..



ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలను సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. నేటి సమాజంలో మహిళల పాత్రను, మహిళలు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: వివేకవర్ధిని పాఠశాలలో..



దంతాలపల్లి: ప్రజావైద్యశాలలో మహిళలకు సన్మానం..



డోర్నకల్: ఉపాధ్యాయినులకు సన్మానం..



నెహ్రూసెంటర్: మున్సిపాలిటీ సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు



మరిపెడ రూరల్: తానంచర్లలో వేడుకల్లో పాల్గొన్న ఉపాధి కూలీలు



కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ)లో..



బయ్యారం: పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ, ఎస్సై



నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో..



మరిపెడ: రిటైర్డ్ మహిళా ఉద్యోగులకు సన్మానం..



పెద్దవంగర: బంగారుచెలిమి తండాలో..



గార్ల పోలీస్‌స్టేషన్‌లో..



మహబూబాబాద్ రూరల్: మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు



నర్సింహులపేట: పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం..



మహబూబాబాద్ అర్బన్: మహిళలను సన్మానిస్తున్న వాకర్స్ కాఫీ క్లబ్ సభ్యులు

సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలి

నెహ్రూసెంటర్: ఎస్సీ జనాభా దామాషా ప్రకారం 2025–26 కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో అధికంగా సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి వారి అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయలపాటి చిరంజీవి అన్నారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో వేములవాడలో జరిగే డీహెచ్‌పీఎస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కరపత్రాలను సంఘ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితవాడల అభివృద్ధి, దళితులకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మంద శంకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిండ్ల సాంబలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హక్కుల కోసం పోరాటాల్లోకి రావాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

నెహ్రూసెంటర్: ప్రపంచ మహిళా దినోత్సవ స్ఫూర్తితో తమ హక్కులు, చట్టాల అమలు కోసం పోరాటాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడులు, దౌర్జన్యాలు పెరుగుతూనే ఉండడంతో మహిళలు సమనత్వాన్ని పొందలేకపోతున్నారని, అడుగడుగున అవమానాలకు గురికాక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, వన్‌టౌన్ కార్యదర్శి రావుల రాజు, చాగంటి భాగ్యమ్మ, కుమ్మరికుంట్ల నాగన్న, బానోత్ వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

పరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

కేసముద్రం: గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం ఇచ్చిన తమ పంట భూములకు ఇవ్వాల్సిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలంటూ పలువురు రైతులు ఆందోళనకు దిగిన సంఘటన మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగ్‌పూర్ నుంచి విజయవాడ వైపునకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం, నారాయణపురం గ్రామ రైతులు తమ భూములను ఇచ్చారు. అయితే తమకు చెల్లించాల్సిన పరిహారం ఇప్పటి వరకు అందలేదంటూ, గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను పలువురు రైతులు అడ్డుకున్నారు. వాహనాలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రెండురోజుల్లో పరిహారం మీ ఎకౌంట్‌లో పడుతాయని పోలీసులు రైతులకు నచ్చ చెప్పారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.

చెట్టును ఢీకొట్టిన బైక్..

- యువకుడి మృతి



కల్యాణ్ (ఫైల్)

బయ్యారం: రహదారి పక్కన ఉన్న చెట్టును బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మిర్యాలపెంట సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సూర్యతండాకు చెందిన బాణోత్ కల్యాణ్(26) తన స్నేహితుడు విజయ్‌తో కలిసి కొత్తగూడ మండలం ఓటాయిలో జరిగిన ఓ వివాహానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా ఇల్లెందు–పాకాల రహదారిపై మిర్యాలపెంట వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనగా బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా తన కుమారుడు ప్రమాదంలో మృతి చెందాడా? లేక మరో విధంగా మృతి చెందాడా? అనే విషయంపై అనుమానం వ్యక్తం చేస్తూ పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని మృతిడి తండ్రి కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై తిరుపతి శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ ఫెయిర్ వేడుకలు

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు ప్రత్యేకంగా తయారు చేసిన ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన పిల్లలకు కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ బహుమతులను అందజేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కురవి: చికిత్స పొందుతూ ధరావత్ చిట్టిబాబు(45) మృతి చెందినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ శనివారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజోలు శివారు పోలంపల్లి తండాలో దారావత్ చిట్టిబాబు ఇదే మండలం నల్లెల్ల శివారు గాజ తండా గ్రామానికి చెందిన దారావత్ చంద్రకు కిడ్నీ ఇచ్చినట్లు తెలిపారు. కిడ్నీ ఇచ్చిన తర్వాత అనారోగ్యానికి గురైన చిట్టిబాబు పది రోజుల నుంచి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమార్తె భూక్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కనీస మద్దతు ధర కోసం ఉద్యమించాలి

కురవి: రైతులు పండించిన పంటలకు, కనీస మద్దతు ధర కోసం ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం మండల మూడో మహాసభలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకవర్గాలు మారినప్పటికీ రైతుల పరిస్థితిలో మార్పులు రావడంలేదని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బుడమ వెంకన్న, బొల్లు వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నిర్మాణ బాధ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి, కరణం రాజన్న, తురక రమేష్, వీరగోని రవి, నర్సింగం గురువయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న సురేష్

పెద్దవంగర: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. శనివారం మండలంలోని రెడ్డికుంట తండ పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, మరమ్మతు పనులు ప్రాంభించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడారు. వరి సాగుకు ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సొంత ఖర్చులతో పనులు చేపిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకలు రంగు మురళీ, పాడిశెట్టి సైదులు, యూత్ అధ్యక్షుడు హరికృష్ణ, రెడ్డికుంట మాజీ సర్పంచ్ జగ్గు నాయక్, వెంకన్న పాల్గొన్నారు.

విప్లవంతోనే సమస్యల పరిష్కారం



ఎర్రక్క, అధ్యక్షురాలు



భద్రక్క ప్రధాన కార్యదర్శి

నెహ్రూసెంటర్: నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే మహిళా సమస్యల పరిష్కారం అవుతాయని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా కల్తీ ఎర్రక్క, ఉపాధ్యక్షులుగా తుపాకుల పద్మ, ప్రధాన కార్యదర్శిగా ముయ్యబోయిన భద్రక్క, సహాయ కార్యదర్శిగా వేముల వెంకటమ్మ, కోశాధికారిగా పూనెం రామక్క, కార్యవర్గ సభ్యులుగా పల్ల సోమక్క, గుంట అరుణ, గుగులోత్ కాంతమ్మ, ఏర్పుల సుగుణ, బంగ్లా నీలమ్మ, మిరియాల సుహిత ఎన్నికయ్యారు.

బియ్యం అందజేత

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కొప్పుల పిచ్చమ్మ ఇటీవల మృతిచెందగా, గార్ల మండల నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జంపాల సతీష్, ఉమేష్ పాల్గొన్నారు.

టేకు చెట్లు దగ్ధం

- రూ.లక్ష ఆస్తి నష్టం

చిన్నగూడూరు: ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై టేకు చెట్లు దగ్ధమైన ఘటన మండలంలోని ఉగ్గంపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బాధిత మహిళా రైతు కంచనపల్లి ముత్తమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకేరు వాగు పక్కనే ఉన్న సర్వే నంబర్ 43/5 వ్యవసాయ భూమిలో 15 సంవత్సరాల క్రితం వంద టేకు చెట్లు నాటారు. టేకు చెట్లు ఏపుగా పెరిగి పెద్దగా అవుతున్న క్రమంలో నిప్పంటుకుని సుమారు రూ.లక్ష విలువైన వంద చెట్లు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులే నిప్పంటించి ఉంటారని బాధితులు తెలుపుతున్నారు. ఇట్టి విషయమై శుక్రవారం సాయంత్రం చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులో గల మున్నేరువాగు సమీపంలో పేకాట ఆడుతుండగా ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.12,600 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సాలార్ తండాకు చెందిన గుగులోతు రవి, గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన పాల్తి వెంకన్న, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన నంద్యాల ప్రభాకర్, మహబూబాబాద్ పట్టణానికి చెందిన గణపురం శ్రీనివాస్, వడ్లగుడి వెంకన్న, నారాయణపురం గ్రామానికి చెందిన అల్లూరి రామరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెన్నారంలో..

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను డోర్నకల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ బి.రాజేష్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. వెన్నారం గ్రామ శివారులో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.2,340, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వంశీ, లక్ష్మయ్య, సైదులు, గోపి, రాము, రమేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కర్రలు, వాకర్ల బహూకరణ



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని బలరాం తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఇస్లావత్ బిచ్చనాయక్ వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బిచ్చనాయక్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఇస్లావత్ రోజాకోటి నాయక్ వృద్ధులు, వికలాంగులకు చేతి కర్రలు, వాకర్లను బహూకరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, ఆశవర్కర్ శారద, గ్రామ పంచాయతీ సిబ్బంది, మాజీ సర్పంచ్ కేలోతు చంద్రు, వీరన్న పాల్గొన్నారు.